సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



మిడ్‌మానేరులో 26.27 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో నీటిమట్టం 26.27 టీఎంసీలకు చేరింది. ఎస్సారెస్పీ నుంచి వరద కాల్వ ద్వారా 13,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అనంతగిరి ప్యాకేజీ–10కి నిత్యం 6,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిడ్‌మానేరు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 27.5 టీఎంసీలు, కాగా ఒక్క టీఎంసీ మాత్రమే తక్కువగా ఉంది. కరీంనగర్ ఎల్‌ఎండీలోకి సోమవారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రజాపాలన దినోత్సవం షెడ్యూల్

సిరిసిల్లటౌన్: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం కలెక్టరేట్‌లో ఈనెల 17న నిర్వహిస్తున్నారు. ఈమేరకు షెడ్యూల్‌ను ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. మంగళవారం ఉదయం 9.59 గంటలకు ముఖ్య అతిథి ఆది శ్రీనివాస్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లు ఆహ్వానిస్తారు. 10 నుంచి 10.20 గంటల వరకు జాతీయ జెండా ఆవిష్కరణ, జాతీయ గీతాలాపన, రాష్ట్ర గీతాలాపన, పోలీస్ గౌరవ వందనం, ముఖ్య అతిథి ప్రసంగం, జాతీయ గీతాలాపన నిర్వహిస్తారు.

పకడ్బందీగా రేషన్ డీలర్ల పరీక్ష



రేషన్‌డీలర్ల అర్హత పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

సిరిసిల్లటౌన్: రేషన్‌షాపుల కేటాయింపులో పారదర్శకత కోసం తొలిసారిగా రాత పరీక్ష ఆదివారం పకడ్బందీగా జరిగిందని సిరిసిల్ల ఆర్డీవో ఆర్డీవో లొలేవర్ రమేశ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 58 రేషన్‌షాపుల్లో డీలర్ల భర్తీకి రాత పరీక్ష ద్వారా ఎంపిక ఇటీవల నోటిఫికేషన్ వెలువడగా.. ఆదివారం సిరిసిల్లలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. సిరిసిల్లలో 3 సెంటర్లు ప్రభుత్వ బాలికల సెకండరీ పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్, కుసుమ రామయ్య సెకండరీ పాఠశాలలో రెవెన్యూ సిబ్బంది నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 830 మంది అభ్యర్థులు రాతపరీక్షకు దరఖాస్తులు చేసుకోగా ఆదివారం మూడు సెంటర్లలో కలిపి 735 మంది హాజరయ్యారు. ముగ్గురు ఇన్‌చార్జీలు, 30 మంది ఇన్విజిలేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా విద్యార్థులు



ప్రతిభ చూపిన క్రీడాకారులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని మినీస్టేడియంలో అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాల, బాలికలు పాల్గొన్నారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈనెల 19 నుంచి ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి 30 మందిని ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గొట్టె రామచంద్రం, అక్షయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం



మాట్లాడుతున్న చంద్రం

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం పేర్కొన్నారు. గంభీరావుపేటలో ఆదివారం భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. రానున్న రోజుల్లో ప్రతీ గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలని పాదయాత్రలు చేయనున్నట్లు తెలిపారు. బాల్‌కుమార్, వెంకటరాజం, సాయికుమార్, కార్తీక్, రాములు, ప్రేమ్‌కుమార్, పిట్ల రఘు, సత్యం, రవి, రాజు, శ్యామ్, అనిల్, వెంకటేశ్, రమేశ్, తనుశ్, నిఖిల్ పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీస్‌రూల్స్ సాధిస్తాం



సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు మేలుచేసే ఉమ్మడి సర్వీస్‌రూల్స్ త్వరలో సాధిస్తామని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ పేర్కొన్నారు. సిరిసిల్లలో ఆదివారం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గన్నమనేని శ్రీనివాసరావు, ఎడ్ల కిషన్ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులు మాడిశెట్టి మహేశ్, జక్కరి నవీన్, మహిళా అసోసియేట్ అధ్యక్షులు ఆవునూరి సరోజ తదితరులు ఎన్నికయ్యారు.

మల్కపేటపై చిన్నచూపు

- ట్రయల్‌రన్ పూర్తయినా ఎత్తిపోయని మధ్యమా'నీరు'
- కాళేశ్వరం 9వ ప్యాకేజీపై పట్టింపు కరువు
- మల్లన్నసాగర్‌కు మధ్యమానేరు నుంచి పంపింగ్
- మల్కపేటలో ఒకే టీఎంసీతోనే సరి



ఒక్క టీఎంసీ నీటి నిల్వతో మల్కపేట రిజర్వాయర్

సిరిసిల్ల: జిల్లాలోని మెట్టప్రాంతాలను సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీ పనులపై నిర్లక్ష్యపు నీలినీడలు కమ్ముకున్నాయి. మధ్యమానేరు జలాశయం 25 టీఎంసీల పూర్తి స్థాయి నీటితో నిండుగా ఉండగా.. మల్కపేట రిజర్వాయర్‌కు మాత్రం నీటిని ఎత్తిపోయడం లేదు. ఎక్కడో ఉన్న ఇల్లంతకుంట మండలం అంతగిరిలోని అన్నపూర్ణ ప్రాజెక్టులోకి, అక్కడి నుంచి సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ జలాశయాలకు దక్షిణం దిశగా గోదావరి జలాలు తరలిపోతున్నాయి. కానీ రాజన్నసిరిసిల్ల జిల్లాలోని కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్‌లోకి పశ్చిమం దిశగా రావడం లేదు. దీంతో మలకపేట రిజర్వాయర్‌లో ఒక్క టీఎంసీ నీరు మాత్రమే నిల్వ ఉంది. మల్కపేట రిజర్వాయర్ పూర్తయినా గోదావరి జలాల ఎత్తిపోతలకు నోచుకోవడం లేదు. భారీ వర్షాలతో ప్రాజెక్టుల్లో నీటి నిల్వ ఎక్కువై.. వృథాగా మానేరువాగులోకి వదులుతున్నారే తప్ప పశ్చిమం దిశగా గోదావరి జలాల ఎత్తిపోతలపై నిర్లక్ష్యం కనిపిస్తోంది.

ఏడాది కిందటే ట్రయల్‌రన్

సిరిసిల్ల శివారులోని మధ్యమానేరు జలాశయం నుంచి 12 కిలోమీటర్ల దూరంలోని మల్కపేట రిజర్వాయర్‌కు 2023 జూన్‌లో మొదటిదశ ట్రయల్ రన్ పూర్తయింది. రెండు పైపుల ద్వారా ఒక్క టీఎంసీ నీటిని ఎత్తిపోసిన నీటిపారుదలశాఖ అధికారులు ఏడాదిగా ఒక్క చుక్క నీటిని కూడా ఎత్తిపోయలేదు. ఫలితంగా మల్కపేటలో ప్రస్తుతం ఒక్క టీఎంసీ నీరు మాత్రమే ఉంది. ఈ రిజర్వాయర్ పరిధిలో కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, సిరిసిల్ల మండలాల పరిధిలోని బీడు భూములకు సాగునీరు అందించే వీలుంది. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీలో భాగంగా ఏడాదిలో 120 రోజుల పాటు 11.63 టీఎంసీల నీటిని మధ్యమానేరు నుంచి మల్కపేటకు పంపింగ్ చేయాల్సి ఉంది. మల్కపేట రిజర్వాయర్ సామర్థ్యం మూడు టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ఒక్క టీఎంసీ నీరు ఉంది. మల్కపేటను నింపితే.. అక్కడి నుంచి బ్యాక్‌వాటర్‌ను కాల్వ ద్వారా సింగసముద్రం చెరువుకు, అక్కడి నుంచి గంభీరావుపేట బట్టల చెరువులోకి మళ్లించే అవకాశం ఉంది. అక్కడి నుంచి ఎగువమానేరుకు రెండు టీఎంసీల నీటిని చేర్చాలి. ప్రస్తుతం ఎగువమానేరు జలాశయం వర్షాలతో నిండింది. కానీ మల్కపేట నుంచి ఎగువ మానేరు వరకు 60 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందే వీలుంది. పాత ఆయకట్టు మరో 26 వేల ఎకరాలు స్థి?కరించనున్నారు.

కాళేశ్వరం 9వ ప్యాకేజీ స్వరూపం

పని ప్రారంభం	: 2013
పొడవు	: 32 కిలోమీటర్లు
సొరంగమార్గం	: 12.03 కిలోమీటర్లు (సిరిసిల్ల–మల్కపేట)
వ్యయం	: రూ.1,464.42 కోట్లు
ప్రధాన జలాశయాలు	: మల్కపేట, బట్టలచెరువు
కొత్త ఆయకట్టు	: 60వేల ఎకరాలు
స్థిరీకరణ	: 2.78 లక్షల ఎకరాలు
సామర్థ్యం	: 11.63 టీఎంసీలు 120 రోజులు పంపింగ్

నిండుగా మధ్యమానేరు

మధ్యమానేరు జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 27 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి జూలై 27న గోదావరి జలాలు మళ్లించారు. కానీ భారీ వర్షాలతో మధ్యమానేరు నిండింది. ఇక్కడి నుంచి అంతగిరి ప్రాజెక్టు, అక్కడి నుంచి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ వరకు మధ్యమానేరు నీరు తరలిపోతుంది. అంతగిరి ప్రాజెక్టు నుంచి రోజుకు వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో తోటపల్లి, గౌరవెల్లి వరకు 70వేల ఎకరాలకు సాగునీరు చేరుతుంది. వందల కిలోమీటర్ల దూరం గోదావరి జలాలు వెళ్తుండగా.. 12 కిలోమీటర్ల దూరంలోని మల్కపేటకు మాత్రం మా'నీరు' వెళ్లడం లేదు.

ఆది శ్రీనివాస్‌పైనే రైతుల ఆశలు

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై రైతులు ఆశలు పెట్టుకున్నారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని మల్కపేట రిజర్వాయర్‌ను 2023లోనే అప్పటి సీఎం కేసీఆర్ వచ్చి ప్రారంభిస్తారని ఒక్క టీఎంసీ నీటిని నిల్వచేశారు.



మూడు టీఎంసీల నీటితో అంతగిరి(అన్నపూర్ణ) జలాశయం

కానీ ముహూర్తం కుదరక ప్రారంభోత్సవం ఆగిపోయింది. అప్పటి నుంచి మల్కపేట రిజర్వాయర్‌ను ప్రారంభించలేదు. మధ్యమానేరులో నీరున్నా పంపింగ్ చేయడం లేదు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవ చూపితే మల్కపేటకు గోదావరి జలాలు పూర్తి స్థాయిలో చేరుతాయి. సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభోత్సవం చేయిస్తే నిమ్మపల్లి మూలవాగుకు గోదావరి జలాలను చేర్చే ఎత్తిపోతల పథకానికి మోక్షం లభిస్తుంది. ఈ పథకం పూర్తయితే వేములవాడ మూలవాగు సజీవజలధారగా నిలుస్తుంది. మల్కపేట నిండితే సిరిసిల్ల ప్రాంతంలో భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంది.

మరో టీఎంసీ నింపాల్సి ఉంది



మల్కపేటలో ఒక్క టీఎంసీ నీరుంది. మరో టీఎంసీ నీటిని నింపాల్సి ఉంది. దీనిపై ఇంకా ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోలేదు. రెండు పంపులను రన్ చేస్తే మల్కపేటను నింపే అవకాశం ఉంది. ఇంకా ఎలాంటి యాక్షన్‌ప్లాన్ ఇప్పటికైతే లేదు. జిల్లాలోని చెరువులు వర్షాలతో ఇప్పటికే 90 శాతం మేరకు నిండాయి. సాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదు.

– అమరేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ, సిరిసిల్ల

ఎవరెవరు ఫారిన్ వెళ్లారు?!



- బిట్ కాయిన్ దందాపై పోలీసుల నజర్
- అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లిన ఉద్యోగుల వివరాలపై దృష్టి
- భార్య పుస్తెలు తాకట్టు పెట్టి మరీ పెట్టుబడులు
- ఏజెంట్ల వద్దకు పేద ఇన్వెస్టర్ల పరుగులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ పేరు చెప్పి ఉమ్మడి జిల్లాలో నడుస్తున్న దందాపై పోలీసులు దృష్టి సారించారు. ఈ అక్రమ దందాలో కరీంనగర్‌లో కీలకంగా ఉన్న ముగ్గురి వివరాలు పోలీసులు సేకరించారు. కింగ్‌పిన్ కింద పనిచేస్తున్న వారిలో పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్‌లో కీలక ఏజెంట్లు ఉన్నారని గుర్తించారు. మరోవైపు జగిత్యాల జిల్లా పోలీసులు కూడా ఈ మల్టీ లెవల్ మార్కెటింగ్‌పై దృష్టి సారించారు. రూ.వందల కోట్ల దందాలో ప్రభుత్వ ఉద్యోగుల ఫారిన్ ట్రిప్పులు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. వీరిలో చాలామంది అనుమతి తీసుకోకుండానే వెళ్లారన్న సమాచారం ఆయా వర్గాల్లో కలకలం రేపుతోంది.

విదేశీ యాత్రకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి

ఈ దందాలో టీచర్లు, రెవెన్యూ, పోలీసు ఉద్యోగులు కీలకంగా మారారు. అధికంగా కొత్త కస్టమర్లను చేర్పించి త్రీ స్టార్ నుంచి ఫైవ్ స్టార్ వరకు చేరుకున్న వారిలో వీరే అధికం. పదేపదే ఫారిన్ ట్రిప్పులకు వెళ్లిన వారిలో వీరే అధికంగా ఉన్నారు. విదేశాలకు వెళ్లడం తప్పేం కాదు, వెళ్లిన ప్రతీసారి ప్రభుత్వ అనుమతి తీసుకోవడం తప్పనిసరి. ఈ దందాలో చక్రం తిప్పుతున్న కొందరు సర్కారు ఉద్యోగులు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్, ఎస్బీ పోలీసులు ఈ దందా కింగ్‌పిన్‌తోపాటు, విదేశాలకు వెళ్లిన ఉద్యోగులపై దృష్టి సారించాయి. వారి పాస్‌పోర్టుల ఆధారంగా ఎవరెవరు, ఎప్పుడు ఫారిన్ వెళ్లారు? వాటికి అనుమతి ఉందా? లేదా అన్న విషయంపై కూపీ లాగుతున్నారు.

భూములు, పుస్తెలు అమ్మి పెట్టుబడులు

బిట్‌కాయిన్.. క్రిప్టో కరెన్సీ పేరిట జరుగుతున్న మోసాలపై ‘సాక్షి’లో ఆదివారం ప్రచురితమైన కథనం కలకలం రేపుతోంది. ఈ దందాలో ముందు నుంచి ఉన్నవారు ఇప్పటికే లాభాలు గడించారు. వీరి విదేశీయాత్రలు, ఆడంబరాలు చూసి కొందరు పేద, మధ్యతరగతి వారు పెట్టుబడులు పెట్టారు. పెట్టుబడి కోసం కొందరు భూములు విక్రయించగా, మరికొందరు భార్యల మెడలో మంగళసూత్రాలు, నగలు అమ్మి ఆ డబ్బును ఏజెంట్ల చేతిలో పోశారు. తీరా ఈ దందాకు పోలీసులు బ్రేకులు వేస్తారన్న ప్రచారంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. తమను చేర్పించిన ఏజెంట్ల ఇంటికి పరుగులు తీస్తున్నారు. మరోవైపు ఈ దందాపై పోలీసు ఆరా తీయడం ప్రారంభించడంతో ఏజెంట్లు సైతం నీళ్లు నములుతున్నారు. తమ కస్టమర్లకు ఏం చెప్పాలో? ఎలా చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. మరికొందరు పేద ఇన్వెస్టర్లు తమ డబ్బులు ఇవ్వకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఏజెంట్లకు వార్నింగులు ఇస్తున్నారు.

‘సెస్’కు విద్యుత్‌ఫోరం చురకలు



మాట్లాడుతున్న శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) అధికారుల తీరుపై సీజీఆర్‌ఎఫ్ ఫోరం చురకలు అంటించిందని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్లలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కరెంటు బిల్లుల్లో సెస్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 25 రోజులకే రీడింగ్ తీసి దాదాపు 35 రోజుల సరాసరి పద్ధతితో వేస్తున్నారన్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేయగా.. 30, 31 రోజులకు మాత్రమే వినియోగించిన యూనిట్లకు బిల్లులు జారీ చేయాలని ఆదేశించినటు వెల్లడించారు. కుసుమ గణేశ్, చిప్ప దేవదాసు, బోగ రాజయ్య, చీకోటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి రాజన్న గణేశ్



వేములవాడ: రాజన్న ఆలయంలో ఏర్పాటు చేసిన గణేషుడిని ఆదివారం రాత్రి గుడి ధర్మగుండంలో నిమజ్జనం చేశారు. పెద్దసేవలపై ఊరేగించి నిమజ్జనం చేశారు. అంతకుముందు పూర్ణాహుతి నిర్వహించారు. ఈవో, అర్చకులు పాల్గొన్నారు.



తనయుడి చెంత తండ్రికి పూజలు



గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాలను ఆకట్టుకునేలా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్-గీతానగర్ అభివృద్ధి కమిటీ గణేశ్ మండపం వద్ద భారీ శివుడి ప్రతిమ, లింగాన్ని ఏర్పాటు చేశారు. గణేశుడిని దర్శించుకున్న భక్తులు లింగానికి క్షీరాభిషేకం చేస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

నిమజ్జనానికి సిద్ధం

- నేడు వేములవాడలో, రేపు సిరిసిల్లలో శోభాయాత్ర
- మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- మానేరు, మూలవాగుల్లో నిమజ్జనం
- జిల్లాలో 2,200 గణేశ్ విగ్రహాలు
- రూట్‌మ్యాప్‌పై ప్రభుత్వ విప్, కలెక్టర్, ఎస్పీ పరిశీలన

సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం/వేములవాడ: తొమ్మిది రోజులపాటు ఘనమైన పూజలు అందుకున్న గణనాథుడికి వీడ్కోలు పలికేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. నిమజ్జన ఏర్పాట్లను సైతం జిల్లా అధికారులు పూర్తి చేశారు. వేములవాడలో సోమవారం, సిరిసిల్లలో మంగళవారం నిమజ్జనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సిరిసిల్ల మానేరువాగు నుంచి తంగళ్లపల్లికి వెళ్లే పురాతన రోడ్డు సమీపంలో, వేములవాడలో గుడిచెరువులో నిమజ్జనం చేయనున్నారు.

వేములవాడలో నేడు నిమజ్జనోత్సవం

వేములవాడలో సోమవారం నిమజ్జనోత్సవానికి మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేములవాడలో దాదాపు 300లకు పైగా వినాయక మంటపాల నుంచి విగ్రహాలు గుడి చెరువులోకి తరలనున్నాయి. మున్సిపల్ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని రోడ్లను చదును చేశారు. చౌరస్తాలు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లు చేశారు. పట్టణంతోపాటు విలీన గ్రామాల్లోని గణనాథులను గుడి చెరువులో నిమజ్జనం చేయనున్నారు. గుడి చెరువు వద్దకు రెండు రహదారుల్లో వచ్చి.. నిమజ్జనం తర్వాత వన్‌వే ద్వారా భీమన్నగుడి రోడ్డు గుండా పట్టణంలోకి వెళ్లేందుకు అధికారులు రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి, ఏఈ నర్సింహస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సెస్ సిబ్బంది ఏర్పాట్లు పరిశీలించారు. వీఐపీలు కూర్చుండేందుకు వీలుగా గుడి చెరువు వద్ద స్టేజీ ఏర్పాటు చేశారు. నాలుగు క్రేన్లతోపాటు 110 మంది మున్సిపల్, మరో 110 మంది పోలీస్ సిబ్బందిని నిమజ్జన విధులకు వినియోగిస్తున్నారు. 28 మంది రెవెన్యూ సిబ్బంది, 10 మంది హెల్త్, 10 మంది ఫైర్, రెండు ఫైరింజన్లు, ఇరిగేషన్‌కు చెందిన 10 మంది విధుల్లో ఉంటారు.



సిరిసిల్ల మానేరువాగులో నిమజ్జనం ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



రాజన్న గుడి చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌రెడ్డి


సిరిసిల్ల మానేరులో ప్రత్యేక కొలనులు

సిరిసిల్ల శివారులోని మానేరునదిలో ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, డీఈఈ బి.ప్రసాద్ నేతృత్వంలో ప్రత్యేక కొలనులు తవ్వించారు. 30 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో పెద్ద కొలను, అంతకన్నా కొంత చిన్నసైజులో మరో కొలను తవ్వించారు. వీటితో పాటు వాగులో రాత్రింబవళ్లు విద్యుద్దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టారు. ఆరు భారీ క్రేన్లు ఏర్పాటు చేయగా.. మూడు మానేరువాగులో, మరో మూడు క్రేన్లు వినాయక మంటపాల నుంచి విగ్రహాలను ఎత్తడానికి వినియోగిస్తారు. నిమజ్జన స్థలంలో పద్దెనిమిది మంది గజ ఈతగాళ్లతోపాటు 60 మంది శానిటేషన్ కార్మికులు మూడు షిఫ్టుల్లో పనిచేస్తారు. ఇక మిగతా మున్సిపల్, సెస్, ఫైర్, వైద్యారోగ్యం, పోలీస్ శాఖల సిబ్బంది నిరంతర విధులు నిర్వర్తిస్తారు. సిరిసిల్ల పట్టణంలోని మానేరుతీరం, విలీన గ్రామాలు చంద్రంపేట, రగుడు, రాజీవ్‌నగర్, పెద్దబోనాల, చిన్నబోనాల, పెద్దూరు, సర్దాపూర్‌లలో సమీప చెరువుల్లో నిమజ్జన పాయింట్లను ఏర్పాటు చేశారు.

600 మందితో బందోబస్తు

నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. రూట్‌మ్యాప్ రూపొందించడంతోపాటు ప్రధానచౌరస్తాల్లో బందోబస్తు చర్యలపై ఇప్పటికే నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లాలో ఐదు ఫీట్లు అంతకుమించి ఎత్తున్న విగ్రహాలు 2,200 వరకు ఉన్నాయి. జిల్లాలోని సివిల్, ఏఆర్, హోంగార్డ్స్, వివిధ విభాగాల నుంచి 520 మంది పోలీసులు విధుల్లో ఉంటారని, వీరికి అదనంగా మరో 80 మంది ట్రెయినీ కానిస్టేబుళ్ల సేవలు వినియోగించుకోనున్నారు. అధిక శబ్దాలు ఇచ్చే డీజేలను పోలీసులు నిషేధించారు. అర్ధరాత్రి 12 గంటల వరకే శోభాయాత్ర నిర్వహించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎవరికీ ఇబ్బందులు కలిగేలా వ్యవహరించొద్దని సూచనలు చేశారు.

భారీ బందోబస్తు



వేములవాడ నిమజ్జనోత్సవంలో ఈసారి ప్రత్యేకంగా పుష్షింగ్ పార్టీలను ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడా వినాయకులు ఎక్కువ సేపు ఆగకుండా తమ సిబ్బంది ముందుకు సాగనంపుతారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి. ముగ్గురు సీఐలతోపాటు డివిజన్‌లోని 110 మంది సిబ్బందిని బందోబస్తుకు వాడుతున్నాం. మధ్యాహ్నం నుంచే నిమజ్జనం ప్రారంభించాలి.

– శేషాద్రినిరెడ్డి, వేములవాడ, ఏఎస్పీ

ప్రజలు సహకరించాలి



భక్తిమార్గంలో శోభాయాత్ర నిర్వహించుకోవాలి. ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి. ప్రజలు పోలీసులకు సహకరించాలి. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశాం.

– ఎస్పీ అఖిల్ మహాజన్

క్లుప్తంగా

అథ్లెటిక్స్ పోటీలో ప్రతిభ



కోనరావుపేట(వేములవాడ): సౌత్‌జోన్ అథ్లెటిక్స్ మీట్ పోటీల్లో నిజామాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సిరిసిల్లలో నిర్వహించిన పోటీల్లో నలుగురు విద్యార్థులు పాల్గొన్నారు. అండర్–14లో ఎండీ మునీర్ 100 మీటర్లలో గోల్డ్, లాంగ్‌జంప్‌లో సిల్వర్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నాడు. మరో విద్యార్థి మజీద్ 100 మీటర్లతోపాటు లాంగ్‌జంప్‌లో, ఫారూక్ లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. వీరిని హెచ్‌ఎం షాబొద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ సుంకటి అజయ్‌కుమార్ అభినందించారు.

నిమజ్జన ఏర్పాట్లలో లోపాలుండొద్దు



వేములవాడ: వేములవాడలో సోమవారం జరిగే గణేశ్ నిమజ్జనోత్సవం ఏర్పాట్లలో లోపాలుండొద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మున్సిపల్ అధికారులను కోరారు. రాజన్న గుడి వద్ద నిమజ్జనం ఏర్పాట్లను ఆదివారం కమిషనర్ సంపత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ప్రధాన కూడళ్లలో లైటింగ్ ఏర్పాటు చేయాలని, మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణాధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంటి మహేశ్, నాయకులు పిన్నింటి హన్మండ్లు పాల్గొన్నారు.

కేసీఆర్‌నగర్‌లో సౌకర్యాలు కల్పించండి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండెపల్లి డబుల్ బెడ్‌రూమ్.. కేసీఆర్‌నగర్ వాసులకు సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం కేసీఆర్‌నగర్‌ను సందర్శించి మాట్లాడారు. కేసీఆర్ నగర్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి జ్వరాలు వస్తున్నాయన్నారు. కలెక్టర్ స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరారు. నాయకులు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, మూశం శంకర్, గోవిందు లక్ష్మణ్, తాటిపాముల లక్ష్మణ్, కట్ట రవికుమార్ పాల్గొన్నారు.

'బీజేపీతోనే సుస్థిర పాలన'



ముస్తాబాద్(సిరిసిల్ల): బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని ఆ పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ మల్లారపు సంతోష్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో బీజేపీ సభ్యత్వ నమోదును ఆదివారం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. అతి పెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. గత పన్నెండు రోజుల్లోనే దేశంలో 12 కోట్ల మంది బీజేపీ సభ్యత్వ నమోదు చేసుకున్నారని గుర్తు చేశారు. మెరుగు అంజాగౌడ్, కరెడ్ల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, బాధ నరేశ్, చిగురు వెంకన్న, శ్రీనివాస్‌రావు, మల్లేశ్, గోపి, శంకర్, బాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, సత్తయ్య, స్వామి, కార్తీక్, కృష్ణ పాల్గొన్నారు.

నిజాంను తరిమిన గడ్డ



ఎన్‌కౌంటర్‌లో అమరులైన వారి శిలాఫలకం(ఫైల్)

- తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ఉమ్మడి జిల్లాది ప్రముఖపాత్ర
- త్యాగధనుల పురిటి గడ్డ.. తిరగబడ్డ పోరుగడ్డ
- పోరాటంలో నెలకొరిగిన వందలాది మంది యోధులు

కరీంనగర్: 'భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం బందూక్ పట్టి తిరగబడిన నేల ఇది. నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న తెలంగాణ ప్రజల విముక్తి కోసం జిల్లా ముద్దుబిడ్డలు ప్రాణాలు తృణప్రాయంగా వదిలారు. నిజాంకు వ్యతిరేకంగా సాగిన పోరులో జిల్లా ప్రజలు సాయుధ గెరిల్లాలుగా, నాయకులుగా అగ్రభాగాన నిలిచారు. నాటి జ్ఞాపకాలు, అజరామరమైన అమరుల బలిదాన ఫలితమే తెలంగాణ విమోచన దినోత్సవం.'

రణభేరి మోగించిన 'అనభేరి'

జమీందారి కుటుంబంలో జన్మించి పీడిత, తాడిత, ప్రజల కోసం జీవితాన్ని అర్పించిన త్యాగధనుడు అనభేరి ప్రభాకర్‌రావు. 1910 ఆగస్టు 15న తిమ్మాపూర్ మండలం పొలంపెల్లిలో జన్మించారు. ప్రాథమిక విద్య మచిలీపట్నం, ఉన్నత విద్య హైదరాబాద్‌లో అభ్యసించారు. రజాకార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా దళం ఏర్పాటు చేసి నిజాం గుండెల్లో రైళ్లు పరుగెత్తించాడు.

మహ్మదాపూర్ గుట్టల్లో..

ప్రభాకర్‌రావును పట్టుకునేందుకు నిజాం ప్రభుత్వం ప్రత్యేక మిలటరీ ఫోర్స్ ఏర్పాటు చేసింది. 1948 మార్చి 14న ప్రభాకర్ సాయుధ దళాన్ని హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ పోలీస్ పటేల్ భోజనానికి పిలిచి ఆ సమాచారాన్ని నిజాం ప్రభుత్వానికి తెలియజేశారు. దీంతో మహ్మదాపూర్ గుట్టలను రజాకార్లు చుట్టుముట్టి కాల్పులు జరిపారు. వారి తూటాలకు ఎదురొడ్డి పోరాడి అనభేరితో పాటు, సింగిరెడ్డి భూపతిరెడ్డి, ముస్కు చొక్కారెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, అయిరెడ్డి భూంరెడ్డి, తూమేజు నారాయణ, బి.దామోదర్‌రెడ్డి, ఇల్లందుల పాపయ్య, పోరెడ్డి రాంరెడ్డి, నల్గొండ రాజారాం, చిక్కుడు సాయిలు, రోండ్ల మాధవరెడ్డి అమరులయ్యారు.

నిప్పురవ్వ బద్దం ఎల్లారెడ్డి

ఉమ్మడి జిల్లాలోని ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, ముగ్దుం మొహినొద్దీన్ తదితరులు ప్రజలను చైతన్యం చేశారు. పోరాటం ఉధృతంగా సాగిన సమయంలో ఎల్లారెడ్డిని అరెస్టు చేసి నాలుగేళ్లు వరంగల్ జైలులో నిర్బంధించారు. జిల్లాలోని బుగ్గారం, ఇందుర్తి, కరీంనగర్, చొప్పదండి నుంచి ప్రజాప్రతినిధిగా ఎంపికై ప్రజాసేవలో తరించారు.

వీర తెలంగాణ లక్ష్యంగా..

సంస్థానం యూనియన్‌లో విలీనం కావాలనే కాంక్షతో చెన్నమనేని రాజేశ్వర్‌రావు అప్పటి విద్యార్థి సంఘం సిటీ కాలేజీ కార్యదర్శి రఫీ అహ్మద్‌తో 1947 ఆగస్టు 15న కళాశాలపై జెండా ఎగురవేయించారు. చాందాలో రహస్య క్యాంపు అనంతరం రావి నారాయణరెడ్డితో పాటు అరెస్టయ్యారు. చంచల్‌గూడ, గుల్బర్గా జైళ్లలో 12 నెలల పాటు మగ్గాడు. రాజేశ్వర్‌రావు సిరిసిల్ల, చొప్పదండి, బుగ్గారం తదితర చోట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

కొరియర్‌గా చిన్నమల్లయ్య

సాయుధ పోరాటంలో కొరియర్‌గా పాల్గొన్న దేశిని చిన్నమల్లయ్య మలి విడత తెలంగాణ ఉద్యమంలోనూ క్రియాశీలంగా వ్యవహరించారు. అనభేరి దళానికి కొరియర్‌గా పని చేశారు. ప్రజాజీవితంలో నాలుగు సార్లు సర్పంచ్, ఒకసారి సమితి ప్రెసిడెంట్, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వర్తించారు.

విద్యార్థి ఉద్యమంలో..

విద్యార్థి దశలోనే గౌతంరావు స్వాతంత్య్ర ఉద్యమంలో చేరారు. విలీనోద్యమంలో పాల్గొని కరీంనగర్, వరంగల్ జైళ్లలో శిక్ష అనుభవించారు. 1947లో ఔరంగాబాద్ జైలు నుంచి తప్పించుకొని వచ్చి మళ్లీ ఉద్యమంలో పాల్గొన్నారు.



మహ్మదాపూర్ గుట్టల్లో అనభేరి దళం అమరులైన స్థలం (ఫైల్)

ఊరూరా ప్రచారం

1947 అక్టోబర్ 2న అనేక గ్రామాల్లో బోయినిపల్లి వెంకటరామరావు గాంధీ జయంతిని జరిపారు. సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలని ఊరూరా ప్రచారం చేశారు. నిజాం పోలీసులు, రజాకార్లు తోటపెల్లిలోని ఆయన ఇంటిని ధ్వంసం చేశారు.

ఉద్యమకారులకు కొరియర్..

జిల్లాకు చెందిన వెలిచాల కొండల్‌రావు హైదరాబాద్‌లో చదువుకుంటూనే విద్యార్థి కార్యకర్తగా సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 15 ఏళ్ల వయసులో కోర్టు విచారణలో మెజిస్ట్రేట్‌కే ఎదురు తిరిగినందుకు 7 రోజుల జైలు జీవితం గడిపారు. కాంగ్రెస్‌లో సోషలిస్టు వర్గానికి మద్దతునిచ్చే వారు. నాయకులకు కొరియర్‌గా పని చేశారు.

ఔట్‌పోస్ట్‌పై దాడి..

మహదేవ్‌పూర్‌కు చెందిన ఎస్.శంకరయ్య 1947లో ఉద్యమానికి ఆకర్షితుడయ్యారు. ఖమ్మం నుంచి వచ్చిన వెంకటేశ్వర్‌రావుతో కలిసి సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు అప్పట్లో ఎస్‌ఐ గురుదయాళ్ సింగ్ వీరిని అరెస్ట్ చేయగా, తప్పించుకుని చాందా క్యాంపులో చేరిపోయారు. తర్వాత మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌గా భావించి కాళేశ్వరం ఔట్‌పోస్ట్‌పై దాడి చేశారు.

ఠాణాలపై దాడులు

రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ అకృత్యాలకు వ్యతిరేకంగా సాయుధ గెరిల్లా దళాలు దాడులు చేసి తుపాకులను తీసుకెళ్లాయి. ఠాణాల్లో బంధీలుగా ఉన్న వారిని విడిపించారు. సిరిసిల్ల ఠాణాపై అమృతలాల్ శుక్లా దళం దాడి చేసింది. కోహెడ, ఇల్లంతకుంట, కోనరావుపేట, మంథని తదితర ప్రాంతాల్లోని పోలీసు క్యాంప్‌లపై దాడులు జరిగాయి.

సాయుధ పోరాటంలో కొన్ని ఘట్టాలు

- బద్దం ఎల్లారెడ్డి గ్రామం గాలిపెల్లిలో 1942లో పోలీసులు, రజాకార్లు దాడి చేసి పలు ఇళ్లను తగులబెట్టారు. అనేక మందిని కాల్చిచంపారు. అప్పట్లో ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.
- అప్పటి హోంమంత్రి వల్లభాయ్‌పటేల్ ఆదేశాల మేరకు హైదరాబాద్ రాష్ట్రాన్ని ముట్టడించి నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ఆపరేషన్ పోలో జనరల్ చౌదరి నేతృత్వంలో జరిగింది.
- ఆపరేషన్ పోలోలో 800 మంది నిజాం సైనికులు, 1,400 మంది రజాకార్లు మరణించారు. సైనికచర్య 108 గంటల పాటు సాగింది. సెప్టెంబర్ 17న భారత సైన్యానికి నిజాం సైన్యం లొంగిపోయింది.
- ఖాసీంరజ్వీకి న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష విధించింది. 1957 సెప్టెంబర్ 17న పాకిస్తాన్‌కు వెళ్లిపోయాడు.
- హైదరాబాద్ సంస్థాన మిలటరీ గవర్నర్‌గా జనరల్ చౌదరి బాధ్యతలు స్వీకరించారు.
- 1952లో తొలిసారి ఎన్నికలు జరిగాయి.

వినాయకుడి లడ్డూ రూ.31వేలు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): గోపాలరావుపల్లెలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజుల పాటు వినాయకుడితోపాటు పూజలందుకున్న లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. బెంద్రంపల్లి విఘ్నేశ్వర యూత్ లడ్డూను రూ.31వేలకు వల్లకొండ అంజిరెడ్డి–లక్ష్మి దక్కించుకున్నారు. అదేవిధంగా ఓల్డ్ గణేశ్ యూత్ లడ్డూను రూ.14,516కు కడారి మల్లారెడ్డి, ఫ్రెండ్స్ యూత్ ఎంప్లాయీస్‌కాలనీ లడ్డూను రూ.13వేలకు మిరాల శ్రీనివాస్‌యాదవ్, స్కూల్ ఏరియా గణనాథుడి లడ్డూను రూ.7వేలకు కొండవేని శ్రీనివాస్ దక్కించుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

అమరులకు నివాళి



వేములవాడఅర్బన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వారికి సీపీఐ నాయకులు ఆదివారం నివాళి అర్పించారు. వేములవాడలోని అమరుల స్తూపం వద్ద గుమ్మి పుల్లయ్యతోపాటు రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కడారి రాములు, గుంటి వేణు, అజ్జ వేణు, అనసూర్య, శాంతక్క, దుండ్రపెల్లి రవీందర్, పోశెట్టి పాల్గొన్నారు.

ప్రభుత్వ టీచర్‌పై కేసు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని లాల్‌సింగ్ తండాను తీసివేయాలని అసభ్య పదజాలంతో మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ప్రభుత్వ టీచర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్లయ్యగౌడ్ ఆదివారం తెలిపారు. వట్టిమల్లకు చెందిన ప్రభుత్వ టీచర్ లాల్‌సింగ్‌తండాను తీసివేయాలని అసభ్య పదజాలంతో గిరిజనుల మనోభావాలు దెబ్బతీశాడు. తండావాసుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వి'నాయకుల' హవా !

- రాజకీయ ప్రాబల్యం కోసం తంటాలు
- యువతను ఆకర్షించే పనిలో నేతలు
- అన్నదానాలు...ఆరోగ్య.. రక్తదాన శిబిరాలు
- నవరాత్రి ఉత్సవాలకు సహకారం

సిరిసిల్లకల్చరల్: వినాయక నవరాత్రి ఉత్సవాలు రాజకీయ నాయకులకు వేదికలుగా నిలుస్తున్నాయి. ఇప్పటికే రాజకీయాల్లో ఉన్న వారు భవిష్యత్‌ను దృష్టి పెట్టుకొని తమ ఏరియాలోని వినాయక మండపాల నిర్వాహకులకు ఆర్థికంగా తోడు నిలుస్తుండగా.. ఇప్పుడిప్పుడే రాజకీయాల్లో పైకి వస్తున్న యువనాయకులు యువతే లక్ష్యంగా పలు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. కొందరు విగ్రహాలకు దాతలుగా ఉంటే, మరికొందరు అన్నదానాలు, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రజల దృష్టిలో పడేందుకు..

రానున్న డిసెంబర్‌తో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో మరోసారి కౌన్సిల్‌లో తమ ఉనికి నిలుపుకునేందుకు ఇప్పటి నుంచే వేదికను సిద్ధం చేసుకుంటున్నారు. స్థానిక యువతను ఒక్క చోటికి చేర్చేందుకు వినాయక నవరాత్రి ఉత్సవాలు వేదికగా మారుతాయనే నాయకులు వివిధ కార్యక్రమాలతో ప్రజలను ఆకర్షించే పనిలో పడ్డారు. వినాయక నవరాత్రులు అంటేనే యువత మొత్తం ఒక్క చోట చేరే వేడుకలు. స్థానిక నేతలు వారిని తమ వెంట ఉంచుకునేందుకు మండపాల వద్ద హవా కనిపించేలా తొమ్మిది రోజులుగా ఏదో ఒక కార్యక్రమంతో హల్‌చల్ చేస్తున్నారు.

అన్నింటా తామై..

ఉత్సవమూర్తులతోపాటు తొమ్మిది రోజుల్లో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ముందుంటున్నారు. అన్నదానం, వైద్య, ఆరోగ్య శిబిరాల నిర్వహణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలకు స్పాన్సర్‌లుగా ఉంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ మండప నిర్వాహకులు ఇటీవల ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. మరో సిట్టింగ్ కౌన్సిలర్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

గోరింటాల అడవుల్లో చిరుత సంచారం



దూడ కళేబరం

గంభీరావుపేట(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దు గోరింటాల అడవుల్లో చిరుత సంచరిస్తోంది. దీంతో రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం సాయంత్రం గ్రామంలోని దేవుని పాదాల ప్రాంతంలో గేదెల మందలోకి చిరుత ప్రవేశించింది. భయాందోళనకు గురైన కాపరులు, రైతులు ఊళ్లోకి పరుగులు పెట్టారు. ఆదివారం ఉదయం కొంత మంది ఘటన స్థలికి వెళ్లి పరిశీలించారు. దూడ కళేబరం కనిపించింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. గత నెలలో కూడా చిరుత గోరింటాల, దమ్మన్నపేట గ్రామాల శివారులో సంచరించి ఆవులు, గేదెలను చంపి రైతులను భయాందోళనకు గురి చేసింది. మళ్లీ ఇప్పుడు కనిపించడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని కలవరపడుతున్నారు.

నిమజ్జనం చూడకుండానే..



ఘటన స్థలంలో లచ్చన్న, శ్రీనిధి మృతదేహాలు



ఆస్పత్రిలో రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

- రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ప్రైవేటు బస్సు
- తాత, మనుమరాలు అక్కడికక్కడే మృతి
- మనువడి పరిస్థితి విషమం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



లచ్చన్న (ఫైల్)

జగిత్యాలక్రైం: వినాయక నిమజ్జనం చూసేందుకు వస్తున్న తాత, మనుమరాలిని రోడ్డు ప్రమాదంలో మృత్యువు కబలించింది. జగిత్యాల రూరల్ మండలం పొలాస శివారులో ద్విచక్ర వాహనాలను ప్రైవేట్ బస్సు ఢీకొనగా ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఇంకొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాలు.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన బైండ్ల లచ్చన్న (54), తన కూతురు మమతను ధర్మపురికి చెందిన రాజ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశాడు. వారికి శ్రీనిధి (12), మల్లికార్జున్ సంతానం. ఆదివారం సెలవు కావడంతో అల్లీపూర్‌లో జరిగే వినాయక నిమజ్జనం చూసేందుకు మనుమరాలు శ్రీనిధి, మనువడు మల్లికార్జున్‌ను ధర్మపురి నుంచి తన ద్విచక్ర వాహనంపై తీసుకువస్తున్నాడు. అలాగే జగిత్యాల రూరల్ మండలం పొలాసకు చెందిన బదినెపల్లి నర్సయ్య, బూర్ల రాజన్న పని నిమిత్తం జగిత్యాలకు వచ్చి స్వగ్రామం వెళ్తున్నారు. పొలాస శివారులో జగిత్యాల–ధర్మపురి జాతీయ రహదారిపై హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు బస్సు అతివేగంగా వచ్చి వీరి ద్విచక్ర వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైండ్ల లచ్చన్న, శ్రీనిధి అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలు నుజ్జునుజ్జయ్యాయి. మల్లికార్జున్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో ద్విచక్ర వాహనంపై ఉన్న నర్సయ్య, రాజయ్యకు తీవ్రగాయాలయ్యాయి. రహదారి రక్తసిక్తం కావడంతో ఆ దారి వెంట వెళ్లేవారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదానికి కారణమైన ప్రైవేటు బస్సు డ్రైవర్ పరారయ్యాడు.



శ్రీనిధి (ఫైల్)

ధర్మపురి, అల్లీపూర్‌లో విషాదం

జగిత్యాలక్రైం/ధర్మపురి: పొలాస శివారులో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తాత, మనుమరాలు దుర్మరణం చెందగా మనుమడికి తీవ్ర గాయాలైనాయి. ధర్మపురిలోని ముదిరాజ్ కాలనీకి చెందిన నారవేణి రాజ్‌కుమార్, మమత దంపతులకు శ్రీనిధి, మల్లికార్జున్ సంతానం. శ్రీనిధి స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. ఆదివారం బడికి సెలవు కావడంతో తాత లచ్చన్న అల్లీపూర్‌లో జరిగే గణపతి నిమజ్జనం కోసం వారిని తీసుకెళ్లేందుకు వచ్చాడు. పొలాస శివారులో జరిగిన ప్రమాదంలో తాత, మనుమరాలు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. శ్రీనిధి తండ్రి రాజ్‌కుమార్ 6 నెలల క్రితం దుబాయి వెళ్లాడు. రోజూ పిల్లల యోగక్షేమాలు తెలుసుకునే తండ్రికి ప్రమాద విషయం తెలియడంతో శోకసంద్రంలో మునిగాడు. దుబాయి నుంచి రావడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

ట్రాఫిక్ పోలీసునని బైక్ చోరీ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ శాస్త్రీరోడ్‌లో శనివారం రాత్రి సినీఫక్కీలో చోరీ జరిగింది. వన్‌టౌన్ పోలీసుల వివరాలు.. కరీంనగర్ తిలక్‌రోడ్‌కు చెందిన బొజ్జ శివం తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై పనిమీద బయటకు వచ్చాడు. శాస్త్రీరోడ్ సమీపంలోకి వచ్చేసరికి ఓ వ్యక్తి ట్రాఫిక్ పోలీసు వేషధారణలో వచ్చి, ట్రాఫిక్ పోలీసునని పరిచయం చేసుకున్నాడు. ఎస్సైని తీసుకొని వస్తానని చెప్పి శివం బుల్లెట్ బైక్ తీసుకొని వెళ్లాడు. అతడు ఎంతకూ రాకపోయేసరికి మోసపోయానని శివం గ్రహించాడు. ఆదివారం బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైస్‌మిల్లుల యజమానుల్లో గుబులు

వేములవాడరూరల్: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రైస్‌మిల్లుల్లో పీడీఎస్ బియ్యం పట్టుబడడంతో యజమానుల్లో ఆందోళన నెలకొంది. వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి రైస్‌మిల్‌లో శనివారం అధికారులు తనిఖీ చేయగా, బియ్యం పట్టుబడడంతో మిల్లును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. దీంతో కొంత మంది యజమానులు మిల్లుల్లోని బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. కాగా, వేములవాడలో మిల్లును సీజ్ చేసి కేసు నమోదు చేయడంతో మిగతా మిల్లుల యజమానుల్లో భయాందోళన మొదలైంది.

చట్టసభల్లో పట్టభద్రుల గొంతుకనవుతా

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.నరేందర్‌రెడ్డి



వామప్ చేస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే చట్టసభల్లో గొంతుకనవుతానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఆదివారం వాకర్స్‌తో ముఖాముఖి నిర్వహించి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మద్దతు తెలపాలని కోరారు. విద్యారంగం పటిష్టత, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించుటకు అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. తెలంగాణలో పట్టభద్రుల పాత్ర కీలకమని అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించేందుకు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. విద్యారంగం పట్ల పూర్తి అవగాహన ఉన్న తనకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.


వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు చోరీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇంట్లో వంట చేస్తుండగా నిస్సహాయురాలైన వృద్ధురాలిని ఓ దుండగుడు భయభ్రాంతులకు గురి చేసి పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. బాధితురాలు, పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయ సమీపంలో పెంకుటింట్లో ఒంటరి జీవిస్తున్న 77 ఏళ్ల వృద్ధురాలు సబ్బని రుక్కుమ్‌బాయి ఆదివారం ఉదయం వంట చేస్తోంది. ఈక్రమంలో తలపై టోపీ ధరించిన దుండగుడు ఇంట్లోకి ప్రవేశించాడు. వంటలో నిమగ్నమైన రుక్కుమ్‌బాయి మెడలోని రెండున్నర తులాల పుస్తెలతాడు లాక్కుని ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. బాధితురాలు లబోదిబోమంటూ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సై దాస సుధాకర్ చోరీ జరిగిన ఇంటికి చేరుకుని బాధితురాలు నుంచి వివరాలు సేకరించారు. క్లూజ్‌టీమ్‌తో సోదాలు నిర్వహించారు. కాగా, రుక్కుమ్‌బాయి భర్త, కొడుకు చనిపోగా, ఇద్దరు కూతుళ్లు అత్తవారి ఇళ్లలో ఉంటున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిలువ నీడ కరువు





వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో నిలువ నీడ కరువైంది. అంతేకాకుండా పరిసరాలు సైతం పరిశుభ్రంగా లేవు. కస్తూర్బాలో చదువుకుంటున్న పిల్లలను చూసేందుకు వారి తల్లిదండ్రులు ఆదివారం పాఠశాలకు వచ్చారు. అయితే వారు తెచ్చిన ఆహారపదార్థాలను పిల్లలకు తినిపించేందుకు కనీసం కూర్చుందామంటే నీడ కరువైంది. దీంతో ప్రహరీ నీడ ఆసరాగా కూర్చుని పిల్లలకు ఆహారం తినిపించారు. అంతేకాకుండా విద్యాలయం భవనం రెండువైపులా ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగి పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. ప్రస్తుతం జ్వరాలు విజృంభిస్తున్నా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్న ధ్యాస కూడా అక్కడి సిబ్బందికి లేకుండాపోవడం శోచనీయం.



శరణు శరణు రాజన్న



వేములవాడ: వేములవాడ రాజన్నకు ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ధర్మగుండంలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. గణేశ్ నవరాత్రోత్సవాల సందర్భంగా నిన్నమొన్నటి వరకు జనం అంతంత మాత్రమే ఉండగా, వరుస సెలవుల నేపథ్యంలో ఒక్కసారిగా రద్దీ పెరిగిందని ఆలయ అధికారులు పేర్కొన్నారు.